క్లుప్తంగా

రేపు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఈ నెల 21న అమలాపురం హైస్కూలు సెంటరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో హైస్కూలు సెంటరులో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్ జగన్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తారని చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా ఐటీ విభాగం ఆధ్వర్యంలో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు



ఉరుసు ఉత్సవాలకు సిద్ధమైన అమలాపురం దర్గా

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం వీధిలోని దర్గా వద్ద శుక్రవారం నుంచి సయ్యద్ హజరత్ ఖాజా బాబా 67వ ఉరుసు ఉత్సవాల నిర్వహణకు దర్గా కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల సందర్భంగా దర్గాను ముస్తాబు చేశారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు దర్గా నుంచి ఫకీర్ మేళంతో ముస్లిం వీధి, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, నల్లా వీధి, యర్రమిల్లివారి వీధుల మీదుగా ఊరేగింపు జరుగుతుందని కమిటీ తెలిపింది. అనంతరం ఫాతిమా నిర్వహిస్తారు. ఈ నెల 21వ తేదీ రాత్రి 8 గంటలకు మహిళలతో మిలాద్ చేపట్టనున్నారు. 22వ తేదీ ఉదయం జియారత్ ఫాతిమా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో హిందూ, ముస్లిం సోదరులు పాల్గొని ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా కమిటీ కోరింది.

గోడితిప్పలో క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అల్లవరం: గోడితిప్పలోని క్రీస్తు ఆధారణ దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన క్రీస్తు ఆరాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, అంతర్జాతీయ ప్రసంగీకులు కిరణ్‌పాల్ హాజరై క్రీస్తు పుట్టుక నేపథ్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా క్రీస్తు ఆరాధనలు, సువార్తలను అందించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, తోట నరసింహారావు, చిట్నీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దైవ మార్గాన్ని అనుసరించాలి


విలసవిల్లి ప్రార్థనా మందిరంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ప్రజలంతా భక్తితో దైవ మార్గాన్ని అనుసరించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలోని ప్రార్థనా శక్తి మందిరంలో పాస్టర్ చిక్కం దానియేలు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సర్పంచ్ ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సలాది సురేఖరాణి, చిక్కం ఫాతిమా, పాస్టర్ రాము, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణారావు అల్లవరం పోలీస్ స్టేషన్‌ను గురువారం తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై హరీష్ కుమార్ ఎస్పీ కృష్ణారావుకు స్వాగతం పలికారు. గత మూడేళ్ల కాలంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాదు, సీఐ వీరబాబు, ఏఎస్సై కృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం నీడలో శ్మశాన వాటికలు

- మౌలిక వసతుల కరవు
- అంతిమ విధులు చేపట్టేవారికి తప్పని తిప్పలు
- తీర ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం

కాట్రేనికోన: దశాబ్దాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా స్మశాన వాటికల అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతూనే ఉంది. దీంతో చివరి మజిలీ కార్యక్రమ నిర్వహణలోనూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని 16 పంచాయతీల పరిధిలో నిర్మించిన స్మశాన వాటికలకు కనీస వసతులు లేవు. మృత దేహాన్ని దహనం చేసేందుకు గానీ, పూడ్చి వేసేందుకు గానీ అనువైన స్థలం లేదు. మరుభూమికి వచ్చిన వారు ఎండ, వానల నుంచి రక్షణ పొందేందుకు నిలువ నీడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాలు, తాగునీరు, స్నాన వాటికలు లేక అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత కార్యక్రమ నిర్వాహకులు నరకం చూస్తున్నారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా అభివృద్ధి చేసుకున్న దొంతికుర్రు, గచ్చకాయపోర గ్రామాలు తప్ప ఏ గ్రామంలోనూ స్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోలేదు. మండల కేంద్రం కాట్రేనికోన, రామస్వామితోటల్లో స్మశాన వాటికలు ఉన్నాయి. కాట్రేనికోన ప్రధాన స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సర్పంచి గంటి వెంకట సుధాకర్ గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టారు. అయితే స్మశాన వాటికలలో దహన సంస్కారాలు చేసేందుకు ఎంత మాత్రం వీలు లేకుండా ఉంది. పార్థివ దేహాన్ని పాతి పెట్టేందుకు అనువైన స్థలం కూడా లేదు. స్మశాన వాటిక పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండి ఉంది. వేట్లపాలెంలో రెండు చోట్ల ఉన్న శ్మశాన వాటికలు పిచ్చి మొక్కలతో నిండి దట్టమైన అడవిని తలపిస్తోంది. పవిత్ర పుణ్య క్షేత్రం కుండలేశ్వరంలో దహన సంస్కారాలు చేసేందుకు కనీస ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కర్మభూమికి వెళ్లేవారు ఎండలు, వానలకు ఏటి గట్టుపైనే ఉండాల్సి వస్తోంది. చెయ్యేరు, ఉప్పూడి, బంటుమిల్లి, లక్ష్మీవాడ, నడవపల్లి, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు గ్రామాలలోనూ ఇదే పరిస్థితి దాపురించింది.


దాతల సాయంతో అభివృద్ధి చేసుకున్న దొంతికుర్రు ష్మశాన వాటికను ముంచెత్తిన వరదనీరు (ఫైల్)

పడవలపై ప్రయాణం

సముద్ర తీర ప్రాంతాలైన పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర, చిర్రయానం తదితర ప్రాంతాలలో మడ అడవులలోనే దహన సంస్కారాలు చేయవలసి ఉంటుంది. పార్థివ దేహాన్ని పడవలపై కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లి మడ అడవుల్లోని ఎత్తయిన మట్టి దిమ్మలపై పూడ్చి వేస్తారు. కొత్తపాలెం, మొల్లేటి మొగ, బలుసుతిప్ప, మగసానితిప్ప, పోర తదితర ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి. వర్షాకాలం, తుపానుల సమయంలో దహన సంస్కారాలు నిర్వహించడం కత్తిమీద సాములాంటిదే. నిలువ నీడ, తాగునీరు దొరకని పరిస్థితి. దహనం చేసే కట్టెలు తడిచి పోవడం, పూడ్చి వేసేందుకు భూమి ముంపు నీటిలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

చివరి మజిలీలో కర్మభూమికి(కైలాస భూమి)కి వెళ్లి దహన సంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీస వసతులు లేవు. పార్థివ దేహాన్ని పూడ్చేందుకు అనువైన స్థలం లేదు. పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉంది. సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి స్మశాన వాటికల అభివృద్ధి పనులు చేపట్టాలి.
కె. సుబ్రహ్మణ్యం, కాట్రేనికోన గ్రామస్తుడు.

దాతల సహాయం

దొంతుకుర్రు పంచాయతీ పరిధిలో దాతల సహాయంతో పల్లంకుర్రు గోదావరి సమీపంలో స్మశాన వాటికను అభివృద్ధి చేశారు. కై లాస భూమిలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇనుప గ్రిడ్, శివుని విగ్రహం, సేద తీరేందుకు పక్కా భవనాలను ఏర్పాటు చేశారు. గచ్చకాయలపోరలో స్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం గ్రామస్తులు సొంత ఖర్చులతో సుమారు ఎకరం భూమిని మట్టితో పూడ్చి మెరక చేశారు. స్మశాన వాటికకు వెళ్లేందుకు మట్టితో రోడ్డు పనులు చేపట్టగా పంచాయతీ సర్పంచి గంటి వెంకట సుధాకర్ చొరవతో గ్రావెల్ రోడ్డు వేయించారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు స్పందించి శ్మశాన వాటికలను అభివృద్ధి చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దూర ప్రాంతాల్లో రక్తదానం


కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ శిక్షకులు

అమలాపురం టౌన్: స్థానిక స్వామీ వివేకానంద యోగాశ్రమ శిక్షకులు రక్తం అవసరమైన రోగులు, గర్భిణులు, క్షతగాత్రులకు కాకినాడ, రాజమహేంద్రవరం, రాజోలు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం రక్తదానం చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంతుతున్న ఓ రోగికి యోగాశ్రమానికి చెందిన ఎ.సుధాకర్, ఎం.కార్తీక్ అమలాపురం నుంచి వెళ్లి రక్తమిచ్చారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్లేట్ లెట్స్ పడిపోయిన గర్భిణీలకు యోగాశ్రమానికి చెందిన ఎల్ దుర్గ, టి.అనిల్, ఎ, శ్రీనివాసనాయుడు, ఎం.వెంకటాద్రి నాయుడులు అక్కడికి వెళ్లి రక్తదానం చేశారు. రాజోలు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త హీనతతో బాధపడుతున్న రోగులకు సుంకర దుర్గ తదితరులు రక్తమిచ్చారు. అంబాజీపేట మిస్సమ్మ స్త్రీల ఆస్పత్రిలో ఓ గర్భిణీకి శస్త్రచికిత్స సందర్భంగా బి.కిరణ్, సీహెచ్.రాజులు రక్తమిచ్చి ఆదుకున్నారు. యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ప్రోత్సాహంతో రక్తదాతలు కాకినాడ, రాజమహేంద్రవరం, రాజోలు, అంబాజీపేట ఆస్పత్రులకు వెళ్లి ఆపదలో ఉన్న వారికి రక్తమిచ్చి దాతలయ్యారు. ఆయా ఆస్పత్రుల వైద్యులు, రక్తం పొందిన వారి కుటుంబీకులు యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థిక స్థితిమంతులుగా ఎదగాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: మెప్మా బజార్లతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని తద్వారా వారు ఆర్థిక స్థితిమంతులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఏర్పాటైన మెప్మా బజార్‌ను చైర్‌పర్సన్ నాగేంద్రమణి గురువారం ఉదయం ప్రారంభించి ప్రసంగించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ అధ్యక్షతన స్వయం సహాయక సంఘాల మహిళలు కుటీర పరిశ్రమలతో తమ ఇళ్ల వద్దే తయారు చేసిన పలు ఉత్పత్తులను ఈ బజార్‌లో ప్రదర్శన చేసి విక్రయానికి ఉంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మెప్మా బజార్‌ను సందర్శించి మహిళల సొంత తయారీతో ఉత్పత్తి చేసిన పలు వస్తువులను పరిశీలించారు. మెప్మా సిటీ మేనేజర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్‌లు ఇచ్చే రుణాలతో మహిళలు అల్లికలు, పలు రకాల తినుబండారాలు, క్లీనింగ్ పౌడర్లు, లిక్విడ్లు వంటి వాటిని స్వల్ప లాభాలతో విక్రయానికి ఉంచారని తెలిపారు. ఈ మెప్మా బజార్ గురు, శుక్రవారాల్లో గడియారం స్తంభం సెంటరులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి, మాజీ కౌన్సిలర్లు తిక్కిరెడ్డి నేతాజీ, జంగా అబ్బాయి వెంకన్న, జిల్లా మెప్మా కార్యాలయ ప్రతినిధి సీహెచ్. శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.


అమలాపురంలో మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పి.మల్లవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ పంపన రామకృష్ణ కోరారు. గురువారం పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పితాని త్రినాథరావు, డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, రీసర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ షఫీఉల్లా తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సర్వే కోసం 11, మ్యుటేషన్‌కు సంబంధించి 7, ఇతర సమస్యలపై 33 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, వీఆర్వోలు పలివెల అర్జునరావు, శ్రీనివాసరావు, నాయకులు కుడుపూడి శివన్నారాయణ, ధూళిపూడి వెంకటరమణ, విళ్ల వీర, ముత్యాల జయలక్ష్మి, నిమ్మకాయల మూర్తి, రెవెన్యూ, సచివాలయ, ఎండోమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.
ఫోటోరైటప్


పి.మల్లవరం రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రెవెన్యూ సదస్సుకు సమస్యల వెల్లువ

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు సమస్యలు, అర్జీలు వెల్లువెత్తాయి. గురువారం సమనస గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూమి ఆన్‌లైన్ అవ్వలేదని, తమది కాని భూమికి ఏళ్ల తరబడి పన్ను చెల్లించాల్సి వస్తోందని, మా భూమి మాది కాదంటున్నారని, గ్రామ రెవెన్యూ అధికారులు సరిగ్గా పని చేయడం లేదంటూ ఫిర్యాదులు వచ్చాయి. పలు సమస్యలపై అర్జీలను ప్రజలు మండల తహసీల్దార్ కిషోర్‌బాబుకు అందజేశారు. మాజీ ఎంపీపీ యేరుబండి వెంకటేశ్వరరావు, ఎస్.ఉదయబాబు తదితరులు పాల్గొన్నారు.


సమనస రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిషోర్‌బాబు

నవోదయలో వార్షిక క్రీడా దినోత్సవం


క్రీడాజ్యోతిని వెలిగించిన విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్


హైజంప్ పోటీల్లో క్రీడాకారుడి ప్రదర్శన

హాజరైన విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్

యానాం: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ స్థానిక మెట్టకూరులో నవోదయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథి విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పాల్గొని క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల జీవితంలో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉంటాయని అన్నారు. తద్వారా విద్యార్థులు మానసిక ఉల్లాసాన్ని పొంది దృఢత్వాన్ని సాధిస్తారన్నారు. ఈ క్రీడల్లో భాగంగా వాలీబాల్, షటిల్, ఖోఖో, 400, 200, 100 మీటర్ల పరుగు పందేలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను శివాలిక్ సదన్ సాధించగా రన్నర్‌గా ఆరావళి సదన్ నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ టీచర్ సాంబశివరావు, లక్ష్మీప్రసన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం కావాలి

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం రూరల్: పేద ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా 22 ఏళ్లుగా కృషి చేస్తున్న కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ప్రజారోగ్యంపై దూరదృష్టితో ఆయువు భరోసా పథకం ప్రారంభించారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కిమ్స్ ఆసుపత్రి, వైద్య కళాశాల 22వ వార్షికోత్సవం ఫౌండర్ చైతన్యరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆయువు భరోసా పథకాన్ని మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు మాట్లాడుతూ సుదీర్ఘ ఆరోగ్య ప్రయాణంలో అవసరమయ్యే నివారణ, చికిత్స, పునరావాస సేవలకు అనువైన ఖర్చులకు ఈ పథకం సౌలభ్యంగా ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, ట్రస్టు ఆసుపత్రి ఎండీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మోకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ స్నేహితులు..!

మిత్రుడి వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లరేవు: వారంతా చిన్నతనంలో కలిసి చదువుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. ప్రస్తుతం ఎవరి జీవితాలు వారివి. ఎక్కడెక్కడో ఉంటున్నారు. అయితేనేం తోటి స్నేహితుడికి కొండంత కష్టం వచ్చిందని తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులంతా అతణ్ని చూసి చలించిపోయారు. వైద్యం కోసం ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటారు. వివరాల్లోకి వెళితే.. పోలేకుర్రు గ్రామానికి చెందిన పి.శ్రవణ్‌కుమార్(బాబు) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. మూడు సర్జరీల అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి మంచానికి పరిమితం కావడంతో అతనికి ఆర్థికంగా ఆదుకోవాలని తోటి స్నేహితులు నిర్ణయించారు. చిన్ననాటి స్నేహితులు 43 మంది కలిసి రూ. 66,600 సేకరించారు. ఆ నగదును స్థానికంగా ఉంటున్న పేరూరి శ్రీనివాస్, ఏడిద సూర్యప్రకాష్, కూర్మదాసు మణికృష్ణ, ధూళిపూడి సుబ్బారావులు గురువారం కష్టాల్లో ఉన్న స్నేహితుడు బాబుకు అందజేశారు.


శ్రవణ్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: మండల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మోరా రవికుమార్ గురువారం తెలిపారు. ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలోని గుత్తినదీవి 11/కేవీ, ఎదుర్లంక 11/కేవీ ఫీడర్స్ పరిధిలో సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీని పరిధిలోని జి.వేమవరం, జి.మూలపాలెం, మురమళ్ల, కొత్త మురమళ్ల, టి.కొత్తపల్లి, ఎదురలంక, పాత ఇంజరం, కొమరగిరి, పశువుల్లంక, శేరులంక గ్రామాలు, కేశనకుర్రు పరిధిలో ఆక్వాకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ రవికుమార్ వివరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో చిక్కం సత్తిరాజు కాలనీలో రూ.2 లక్షలు, చీకట్లపాలెం ప్రాంతంలో రూ.2 లక్షలతో మండల పరిషత్ సహకారంతో ఎంపీటీసీ నిధులతో రహదారులను నిర్మిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చిక్కం త్రినాథ, తాళ్ల లక్ష్మీ నరసాయమ్మ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాల సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షుడు మోటూరి రవికుమార్, తాళ్ల రవి, నాగులపల్లి పాపారాజు, చిక్కం భీముడు, సలాది గణపతి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలగుప్తంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

అమ్మవార్లకు సారె సమర్పణ


బండారులంకలో సారెతో వెళుతున్న గురు భవానీలు, భక్తులు

అమలాపురం రూరల్: బండారులంకలో వేంచేసియున్న మురుగులమ్మ, సత్తెమ్మతల్లి అమ్మవార్లకు గురు భవానీలు దంగేటి సాయిబాబు, మట్టపర్తి దుర్గారావు, మట్టపర్తి దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో గురువారం సారె సమర్పించారు. సాయిబాబు, మల్లేశ్వరి దంపతుల స్వగృహం నుంచి భవానీలు, గ్రామ మహిళలు కలిసి అమ్మవార్లకు బోణం, చలివిడి పానకాలు, పసుపు కుంకుమలు, చీరలు, మిఠాయిలు తీసుకువెళ్లారు. మేళతాళాలు, దుర్గమ్మ శరణుఘోష నడుమ భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో గురు భవానీలు మట్టపర్తి శ్రీనివాస్, కేతా దొరబాబు, పాటి శేఖర్, మట్టపర్తి శ్యామ్‌ప్రసాద్, కట్టా వెంకటేశ్వరరావు (కట్టప్ప), వెంకటేశ్వరరావు, నాని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనుల తనిఖీ


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాబ్జిరాజు

అమలాపురం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అమలాపురం రూరల్ మండలంలో నిర్మాణంలో ఉన్న గోకులం పాడి పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు గురువారం తనిఖీ చేశారు. పనుల పటిష్టతను జేఈతో కలిసి పరిశీలించారు. అర్హులైన పేద కూలీలందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. బండారులంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెనుమాల సునీతకు ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత జాతికి క్షమాపణ చెప్పాలి


గోపవరంలో అమిత్‌షా ప్లకార్డులు చూపి నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

ఉప్పలగుప్తం: పార్లమెంటు సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు యావత్ దళిత జాతిని కించపరిచేలా ఉన్నాయని ఆయన వెంటనే దళిత జాతికి క్షమాపణ చెప్పాలని పలు దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. మండలంలోని గోపవరం గ్రామంలో కుంచే బాబులు ఆధ్వర్యంలో దళిత నాయకులు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ఈదరపల్లి వంతెన సమీపంలో గల డాక్టర్ బీర్ అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఆయన విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. అమిత్‌షా వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, ఏఐసీసీ మెంబర్లు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

కె.గంగవరం: వృత్యంతర శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ 6వ విడత శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల చివరి వారంలో క్రిస్మస్ పండగ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉన్నాయన్నారు. అందువల్ల క్రైస్తవ ఉపాధ్యాయులకు ఎటువంటి ఆటంకం లేకుండా డిసెంబర్ 23 నుంచి 28 వరకూ తలపెట్టిన శిక్షణ తరగతులు వాయిదా వేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా 2023 జూలై 1 నుంచి మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, డీఎస్సీ 2003 వారికి సాంకేతికంగా అందాల్సిన పాత పెన్షన్ మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.